## సి.పి.బ్రౌన్ అకాడమీ - నవ్యవీక్లి ఉగాది కథలపోటీలో

## విశేష బహుమతి రూ. 2,000 పొందిన కథ

"గోడ మీంచి తోసేస్తావా, లేక కిందకి దింపి పగలకొడతావా?" శైలిని వేపూ, గోడ గడియారం వేపూ మార్చి మార్చి చూస్తూ అడిగాను. ఏం చేస్తే బాగుంటుందని నన్నడుగుతున్నట్లు ఒక్కసారి చూసి, అంతలోనే- "అది కాదు తాతీ! కిందకి దింపి పగలకొడితే అమ్మకనుమానమొచ్చి నా వీపు పగలకొడుతుంది. గోడ మీంచి తోసేశామనుకో. ఎందుకో అదే కిందపడి పోయిందనుకుంటుంది" అంది అసలే పెద్దవిగా ఉండే తన కళ్లని చక్రాల్లా తిప్పుతూ.

నాకు చాలాముద్దూ, ముచ్చట వేసేశాయి నా మనవరాలి మీద. ఆ తెలివి తేటలకే కాదు, ఆ తేట తెలుగు మాటకీను. ఆరేడేళ్ల అమ్మాయి ఆపాటి తెలుగు మాట్లాడ్డం ఆంధ్రప్రదేశపు మామూలు కుటుంబాలలో అతి సాధారణమే. కాని...

# ఇదీ విషయమే!

### ఇచ్ఛాపురపు రామచంద్రం



ఆంగ్లమూ, అంకెతో తప్ప అన్యమొల్లని కంప్యూటర్ ఉద్యోగాలు వెలగబెట్టే తల్లితండ్రుల ఏకైక పుత్రిక అయి వుంది. దొరల బడులలో చదువుతూ... తెలుగు మాట్లాడితే తలతీసేస్తామనే ఉపాధ్యాయుల విద్యార్థినిగా... తెలుగు రావడమంటే ఎయిడ్స్ వచ్చినంత పరువు తక్కువగా భావిస్తున్న తెలుగు పరిసరాలలో మసులుతూ తెలుగు వినపడకుండా తిరిగే పిల్లది. నాలుగంటే నాలుగే వారాలలో... కేవలమూ రాత్రి పూట అర గంట - గంట సేపు నానోట తెలుగు విని. తన నోట తెలుగు మాటని పాటలా పలుకుతూందంటే నేర్పిన తాతకి ఎంత మురిసిపాటు! పాప పలుకులు నాకు కోయిల కూతలే. అసలు.. చిన్నపిల్లల నోట ఏ భాషయినా బాగుంటుంది. అందులో మాతృభాషయిన... ఇటలీయనాఫ్ ద యీస్ట్ అనిపించుకున్న... తెలుగయితే చెప్పేదేముంది? ఐదో తరగతి పిల్లలకి కూడా అ ఆలు రానివ్వనంత నిర్లక్ష్యం చేయబడిన తెలుగుభాష. నా మనవరాలికి మహచక్కగా వొస్తే... మహదానందం కాదూ తాతకి?

ఈ కాలపు పిల్లలు అతి చురుకు. వీళ్లు. పిల్లలు

కారు, పిడుగులే. ఇంకా – ఒకరే ముద్దు, ఆపై వద్దు.... అంటూ దంపతులు అవలంబించడం వల్ల యింటికొక పిల్ల అయిపోయి... ఒంటరితనపు గ్రహణం పట్టి.... కొంత చురుకుదనాన్నణగ దొక్కేస్తూంది కాని, లేకపోతే వీళ్లని పట్టడం ఎవరికి శక్యం?

''తాతీ! ఎవరూ రావడం లేదు కదా?... చూడు–'' హెచ్చరించింది శైలిని. ద్వారం లోంచి తల బయటకు పెట్టిచూశాను. నా పర్యవేక్షణ సహకారాలతో పాప చేయబోతున్న గడియార భంగకార్యక్రమాన్ని గమనించి మా గుట్టురట్టు చేసేవారు కాని, మా ప్రయత్నాన్నడ్డుకునే వారు కాని ఎవరూలేరని నిర్ధారించుకున్నాను. అప్పుడు ఒకసారి చివరి చూపులు చూసినట్లు గడియారం వేపు చూశాను. కొన్ని నిముషాలలో చచ్చిపోబోతున్న ఆ గడియారం మీద జాలేసింది, పాప చేతిలో అది హత్య చేయబడబోతూందని. నామీద కూడా నాకు జాలేసింది. ఎందుకంటే.

***

నాలుగువారాల కిందట నేనీ ఇంటికివొచ్చి తలుపు తట్టినప్పుడు... తలుపు తెరచిన శైలిని చిన్నపిల్ల భూమికి జానెడుండడం వలన... తిన్నగా చూసిన నా కళ్లకి ఆ హాలు గోడా... దానిమీద షోకుగా ఆధారపడిన ఈ గడియారమూ కనిపించాయి. రంగు గోడమీద బహురాజసంగా ఉంది గడియారం. తొలి చూపులో నాకది ఎంత నచ్చేసిందంటే... దానిని చూస్తూ కొన్ని నిముషాల పాటు పరధ్యానంలో పడిపోయాను. అప్పుడు ''తాతీ!'' అని శైలిని పిలవడంతో యిహలోకంలోకి వచ్చి మనవరాలిని కుశల ప్రశ్నలు వేస్తూ చాకొలెట్ అందించాను. అప్పటికి ఏతెంచింది. ఆయా మరియూ ఎన్నో అయిన ఆవిడ చేతిలో కూరల సంచితో. వొస్తూనే.. నన్ను చూసి కంగారు పడుతూ... ''మీరు శైలిని తాతగారు కదూ! అమ్మగారు చెప్పారు మీరొస్తారని. అయినా సమయానికి ఉండలేక పోయాను. ఏమీ అనుకోకండి. మీరు. పంచదార లేని టీ తీసుకుంటారు. ఔనా? తెస్తాను'' అని వంటింట్లోకి కాబోలు వెళ్లింది.

శైలినితో మాట్లాడుతున్నా మధ్యమధ్య ఆ గడియారం వేపు అప్రయత్నంగా చూస్తూనే ఉన్నాయి నా కళ్లు. నిజంగా అది చాలా బాగుంది.

ఆయా – నాకు టీ, శైలినికి బోర్న్‌విటా తెచ్చింది. తాగి ''నేను పార్క్‌కి వెళ్తాను'' అడిగింది శైలిని ఆంగ్లంలో. ఆవిడ గడియారం చూసి... ''ఇంకా ఐదు కాలేదు. ఐదయ్యాకే పంపమన్నారమ్మ'' అంటూ సమాధానం కూడా ఆంగ్లంలోనే చెప్పింది. ఇంట్లో అలా ఇంగ్లీషువినడం – దేవాలయంలో బూతుమాటలు విన్నట్లే అనిపించింది, నాకు అలవాటు లేక. పాప గడియారం వేపు కొరకొర చూసి ముఖం ముడుచుకుంది. ఆంగ్లంలో విసుక్కుంటూ. ఆ క్షణంలోనే నేననుకున్నాను. పాపకి తెలుగు నేర్పాలని. మాతృభాష నేర్వని పిల్లలు మాతృదేవతని మరచిపోతారని నా భయం. శైలిని – కష్టపడి కాక యిష్టపడి తెలుగు నేర్చుకోవాలి. అది నా కోరిక.

పండిపోయి రాలిపోయే ఎండుటాకూ.... లేత చిగురూ...లా నేనూ శైలినీ. చిత్రమేమిటంటే ముసిలివాళ్లూ, పిల్లలే మంచి స్నేహితులౌతారు. శైలిని దినచర్యలో నేనెక్కడదూరి తెలుగు నేర్పగలనా అని పరిశీలించాను. ఏడు గంటలకి అమ్మలేపగా లేవడమేమిటి శైలినికిక ఖాళీ ఉండదు. స్నానం. బట్టలు, బూట్లు... పలహారం... స్కూలు బస్సు. మళ్లీ ఇంటికి చేరేది సాయంత్రం నాలుగుకే రావడం. ముఖం కడుక్కుని బట్టలు మార్చు కుని... ఏ పాలో బోర్న్‌విటాయో తాగి హోమ్‌వర్క్ చేసేసి... ఓ గంటసేపు ఏ పార్కులో తిరిగి రావడం. లేదా కిందన ఆడుకోవడం. ఆరవుతూంటే వొచ్చేసి – మిగిలిపోయిన హోమ్ వర్కు లేదా చదువు. ఏడవుతూంటే ఆయా భోజనం పెట్టేసి వెళ్లిపోతుంది. ఎనిమిది దాటు తూంటే అమ్మ వొస్తుంది. ఆ గంటా ఒక్కతే ఉంటుంది. అపార్ట్‌మెంటు కనుక వాచ్‌మన్ మీదే భారం. అమ్మస్నానమూ అవీ చేసివచ్చి ఓ అర గంట గడుపుతుంది శైలినితో – ఆపనీ యీ పనీ ఒక వేపు చూసుకుంటూనూ, టీ.వీ. చూస్తూనూ, మధ్యమధ్య శైలినితో మాట్లాడుతూను. తొమ్మిదిన్నరకి పాపని మంచమెక్కించేస్తుంది.



శైలిని తండ్రి విషయం చూస్తే నాకు సండేఫాదర్ గుర్తుకొచ్చాడు. ఒకప్పుడు.... ఉద్యోగం బొంబాయిలో చేస్తున్నా అక్కడ ఖర్చులకి తట్టుకోలేని వారు పూనాలో నివాసం పెట్టుకునే వారు బతకడం చవకని. వాళ్లు – సూర్యుడూ పిల్లలూ కళ్లు తెరవకముందే యిల్లు వదిలేసి, బొంబాయి రైలెక్కి దానిలోనే కాలకృత్యాలు తీర్చుకుని ఉద్యోగ స్థలం చేరుకునే వారు. పని గంటలు ముగిశాక మళ్లీ రైలెక్కి పూనా (యిప్పుడు పూనే) చేరి ఇంటి కొచ్చేసరికి రాత్రయి పిల్లలు గాఢ నిద్రలో ఉండేవారు. అందుచేత ఆ తండ్రీ, కొడుకులూ, కూతుళ్లూ ఒక్కళ్ల నొకళ్లు చూసుకునేది మాట్లాడుకునేది ఆదివారాలు సెలవు దినాల నాడే. ఆ ఉద్యోగులను సండే ఫాదర్స్ అనే వారు. శైలిని తండ్రి సన్‌డే ఫాదర్‌కంటే కూడా ఘోరమూ, అన్యాయమూ, ఆర్థిక మాంద్యం అంటూ మామూలు రోజుల్లో అర్ధరాత్రవుతూంటే రావడమే కాక... శలవు దినాలలోనూ కార్యాలయానికి వెళ్లిపోతున్నాడు.

ఇక శైలిని తల్లిది – మూడుగుర్రాల స్వారీయే. శైలినిని లేపి బడికి తయారుచేయడం, బాక్సులలోకి పలహారమూ అన్నమూ తయారుచేసి సర్దడం, ఉద్యోగ నిర్వహణ, ఫలితం – శైలినికి ఒంటరితనం. బ్యాంకులోని నిలవ అంకెల వెనుక అంగలార్చుకుంటూ అర్థం లేని పరుగులు తీసే దంపతులకి పుట్టిన ఒంటరి పిల్లలు చాలామంది అనుభవించే శాపం యీ ఒంటరితనం. దానికి విరుగుడు మనిషికి మరో మనిషి అనే టానిక్. నేను అదే యివ్వసాగానామెకి. శైలిని రాబోయేవేళకి ద్వారం దగ్గర ఎదురుచూడడం. పాపతో పార్కుకి వెళ్లి అక్కడ అవసరమయితే ఆమెతో ఆడి, తిరిగి యిద్దరమూ కలిసి యిల్లుచేరడం... రోడ్డు మీద అవలంబించ వలసిన భద్రతా సూత్రాలు ఆమె పుస్తకాలలో చదువుకున్నా – వాస్తవంగా ఎలా అవలంబించాలో నేర్పడం – నడుస్తూ కబుర్లో... కథలో చెప్పడం... రాత్రి శైలినితో కలిసి భోం చెయ్యడం... పడుకోబోయేముందు కథలూ, పద్యాలూ చెప్పడం... అలాగ నాలుగయిదు రోజులు చేసే సరికి శైలినికి నేను మంచి స్నేహితుడినై పోయాను. నిజానికి నాలుగు నుంచీ ఏడు వరకూ ఆయా ఉంటుంది కానీ... వెయ్యి ఛాకొలెట్లు ఒక అమ్మ ముద్దుకి సాటిరానట్లే... పది మంది ఆయాలయినా ఒక్క 'మనవాళ్లకి సాటిరారు. కార్యాలయంలో 'చచ్చి చచ్చి పనిచేసి వొచ్చాక యిక నాకు ఇంటిపని, పిల్ల సంగతి చూసే ఓపికెక్కడుంటుంది?' అంటుంది వాళ్లమ్మ. ఈ పరుగుల రోజులలో... ఉద్యోగినుల పిల్లలు ఒంటరితనపు శాపగ్రస్తులు కాక తప్పదు.

ఆవేళ... ''వంట పని చేసేశాను. సర్దేశాను. ఇంటి దగ్గర పనుంది. వెళ్లేదా?'' అని ఆయమ్మ అతి వినయంగానూ తెలుగులోనూ అనుమతి కోరడంతో తక్షణమే అనుగ్రహించేశాను. ఆవిడ వెళ్లాక... తొందరగా తిరిగొచ్చేస్తాను కదా అనుకుని శైలినినింట్లోనే వదిలి నేను బజారుకెళ్లాను. అనుకోకుండా కొంచెం ఆలస్యమయింది. నేను తిరిగి వొచ్చేసరికి – శైలిని భోజనాల

బల్లమీద నిలుచుని... గడియారాన్ని ఒక కర్రతో కొట్టబోతూంది. ఆ గడియారం విదేశీదీ, కొత్తదీ. చూడటానికి బాగుంటుంది. కొన్ని గడియారాలలా భూతం ముఖంతో భయపెట్టకుండా, గంటలు శ్రావ్యంగానే వినిపిస్తుంది తప్పకొట్టదు. కావలసిన వేళకి హెచ్చరిక చేస్తుంది, అలా అమర్చితే. గోడ గడియారాలకిలాటి హెచ్చరిక ఏర్పాటు చాలా అరుదు. ఇంతమంచి గడియారం పట్ల శైలినికి శత్రుత్వమెందుకు? అసంకల్పితంగా అరిచాను. 'శైలినీ!''.

పాప తుళ్ళిపడింది. చేతిలో కర్ర వదిలేసింది. ''తాతీ! నేను టీచరాట ఆడుతున్నాను. గడియారం బుద్ధిగా ఉండడం లేదని... ఉత్తినే బెదిరిస్తున్నానంతే. నిజంగా కొట్టను. అమ్మకి చెప్పకేం?'' కళ్లల్లో నీల్లు. బతిమాలుతున్నట్లు ఏడుస్తున్నట్లూ అంది. అబద్ధం చెబుతూందని పాపకే తెలుసు. నాకూ తెలుసు... ''చెప్పను'' అని హామీ యిచ్చి... దగ్గరకి తీసుకుని కళ్లుతుడిచాను. తరువాత... పాపతో సాన్నిహిత్యం పెంచు కున్నాను. మంచి మంచి కథలు చెబుతూ... చక్కని పద్యాలు వల్లె వేయిస్తూ... ఆమె విశ్వాసాన్నీ స్నేహాన్నీ పొందసాగాను.

నాలుగైదురోజులు. గడియారాన్ని బద్దలు కొట్టే ప్రయత్నం చేస్తూ మళ్లీ దొరికి పోయింది.

''అమ్మకి చెప్పను. కాని. గడియారమంటే నీకెందుకు కోపమో నువ్వు నాకు చెప్పాలి''.

భయంగా తల దించేసుకుంది. నిష్ఠూర స్వరంతో అడిగాను. ''నేను నీ స్నేహితుణ్ణి కానా?''

''స్నేహితుడివే తాతీ!'' విధిలేక అన్నట్లుంది.

''మరి – స్నేహితుడి దగ్గర దాచుకుంటారా ఎవరయినా చెప్పకుండా? నీకు గడియారం అందడం లేదు. నీకు నేను సాయం చేస్తాను. ఇద్దరం కలిసి పగల గొడదాం. కాని... నీకు దాని మీద కోపమెందుకో చెప్పాలి''.

''నిజంగా నువ్వూ గడియారాన్ని బద్దలు కొడతావా! అదంటే నీకూ కోపమేనా? ఎందుకూ?'' ఆశ్చర్యంగా చూసింది.

''ముందు నేనడిగాను కనక నువ్వు చెప్పు. తరవాత నేను. ఏం?''

''తాతీ!'' మెల్లగా చెప్పసాగింది. ''పొద్దున్నే ఎంతో చలేస్తుంది కదా?''

''ఊ''.

''రగ్గులోంచి పైకి రాబుద్దెయ్యదు. లేవబుద్దెయ్యదు. కానీ... అమ్మా లేవగొట్టేస్తుంది. అమ్మమంచిదే. కాని... ఆ గడియారం ఏడ్చిపోతుంది. అందుకే అమ్మ నన్ను లేపేస్తుంది. లేస్తానా... యిట్టే ఎనిమిదయి పోతుంది. బడి బస్సొచ్చే వేళయిపోతుంది. అప్పుడంత తొందర పడి పోతుందా గడియారం.. సాయంత్రం నేను బయటికిపోడానికి ఎంతకి ఐదవదు! ఏడిపించుకుతింటుంది. మళ్లీ. రాత్రి అన్నం తినే శాక నీ దగ్గరకొచ్చి కథలు చెప్పించుకుంటానా... అప్పుడేమో యిట్టే పరుగెత్తేస్తుంది, నాకు నిద్దర రాకుండానే. అమ్మని తొందరగా యింటికి రానివ్వదు''.

పాప గొంతు నిండా ఉక్రోషం. శైలినికి గడియారం మీద అంత కోపానికి అర్థముందని నాకు అర్థమయింది.

''నీకెందుకు తాతి దానిమీద కోపం?''

''శైలూ! నువ్వంటే నాకెంతో యిష్టం. అంచేత. నీకు గడియారం మీద కోపం కనక నాకూ కోపం'' అన్నాను. పాప ముఖంలో ఎంత సంతృప్తో!

''ఐతే... మనం దాన్ని బద్దలు కొట్టేద్దామా? నువ్వు నాకు సాయం చేస్తావా?''

''ఓ'' అన్నాను సంతోషంగా. నా సంతోషం – శైలిని చక్కగా తెలుగు మాట్లాడుతున్నందుకూ, ఇంగ్లీషు బేబి అతి తొందరగా తెలుగు పాప అవుతున్నందుకు. పాప ఉద్దేశం – తన బాధలకు కారణం గడియారమని. అందుకే అది ఆమెకి శత్రువులా కనిపిస్తూ వొస్తూంది. అందుకే దానిని బద్దలు కొట్టెయ్యాలనుకుంటుంది. పాప ఆలోచన. ఆగ్రహమూ సమంజసమే. ఆ వయసుకి.

నాకు పాపకంటే ముఖ్యం కాదు గడియారం. అందుకే.. నా తొలిచూపు లోని ప్రేమని చంపుకుని మరీ గడియారాన్ని చంపెయ్యడానికి పాపకి నా సహాయ సహకారాలు వాగ్దానం చేశాను.

***


భోజనాల బల్లమీద... చిన్న ప్లాస్టిక్ స్టూలు వేశాను. పాప అది ఎక్కింది. ఇప్పుడు పాపకి గడియారం చక్కగా అందుతోంది. నేను ద్వారం దగ్గర కాపలా నిలుచున్నాను. అంతా సిద్ధమేనా అని నావేపు చూసింది శైలిని. నేను తల పంకించి – ''ఒకటి... రెండూ... మూడు!'' చెప్పాను. ఒక్క నిముషం... జరిగేది చూడలేనట్లు కళ్లు మూసుకున్నాను. అంతవరకూ నిశ్శబ్దంగా ఉన్న ఆ హాలులో – చిన్నశబ్దం. కళ్లు తెరిచాను. గడియారం మేకు నుంచి రానంటూ మొరాయింపు. అంతకంటే పట్టుదలగా శైలిని ప్రయత్నం. అంతే... అంతవరకూ రంగు గోడమీద రాజసం వొలకబోస్తూ ఠీవిగా ఆనుకున్న విదేశీ గడియారం. అందమైన ఖరీదయిన.. అరుదైన గడియారం. 'ఆకాశంబున నుండి, శంభుని శిరంబు... అందుండి' అన్నట్లు. గోడ మీంచి భోజన బల్లమీదకీ, అక్కడి నుంచి గచ్చు నేలమీదకీ పడి... భొళ్లున పగిలిపోయింది. ఆమేర చిందరవందరగా చెదిరిపడిన గాజు పెంకులు. పాలరాతి నేలమీద వెల్లకిలా పడిన గడియారంలో పైకి చూస్తున్న ముల్లు. నాలోనూ, శైలినిలోను ఒక విధమయిన ఉద్విగ్నత. విజేతలో కలిగే పొంగు. అంతలోనే మనసులో శూన్యం. ఎన్నాళ్లదో ఉపద్రవానికి చరమగీతం పాడిన ఆనందం. అదీ క్షణికమే. పాట చివరి పదం కూడా పాడేశాక... పాడడానికింకేమీ మిగలక, లేక.. గాయకుడిలో మిగిలిన స్థబ్దత వంటి.. నైరాశ్యం వంటి... నిస్పృహలాటి... నీరవం.

''తాతీ!'' పాప నా మీదకు గెంతి నన్నల్లుకుపోయింది. లేత మనసులో పట్టనన్ని భావపరంపరలను భరించలేక ఏమో! నేనూ భయం లేదన్నట్లామెని ఎత్తుకుని గుండెల మీదకి తీసుకుని తలనిమరసాగాను. ఇద్దరి ఉచ్ఛ్వాస నిశ్వాసాలూ ఒకే లయలో. ఇద్దరి గుండె చప్పుళ్లూ ఒకే శ్రుతిలో.

పాము చచ్చిపోయిన కొంచెం సేపటివరకూ కొన ప్రాణం ఉన్నట్లు తోక చివర కదుపుతూ ఉండేటట్లు... గడియారం ముక్కలయి చచ్చినా సెకనుల ముల్లు యింకా కొంచెం కదులుతూంది. 'ఏడేళ్లయినా లేని ఆ పసిది ఏదో భ్రమపడి ఉండొచ్చు. ఏడు పదులు నిండాయే... నువ్వు.. నా కోడీ కుంపటిలేనిదే ఎలా తెల్లారుతుందో చూస్తానని కోడి కూయకుండా మూతి కట్టేసిన అమాయకపు మూర్ఖపు ముసిలమ్మలా – గడియారం పగల గొట్టేసినంత మాత్రాన కాలం ఆగిపోతుందనుకున్నావ్? అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతి నాపలేరు – అని వినలేదా? నన్ను పగతో పగల గొట్టడం ఎంతవ్యర్థమో నీకు తెలీదూ?' అని నన్నడుగుతున్నట్లే అనిపించింది.

'మనిషిని గడియారమూ, క్యాలెండరూ పెట్టిస్తున్న ఉరకలు పరుగులతో మరుగున పడిపోతున్న మానవ సంబంధాలకు మళ్లీ పట్టం కట్టాలన్న మహాయజ్ఞానికి యీ చిన్న విప్లవయత్నం – వ్యర్థమా, స్వార్థమా అని కాదు ప్రశ్న. ప్రయత్నమంటూ ఆ దిశలో జరిగిందా లేదా అనేదే ముఖ్యం. ఎందుకంటే... ఎంతపెద్ద ప్రయాణమయినా తొలి అడుగుతోనే ప్రారంభ మౌతుంది. నేటి ఓటమి రేపటి విజయానికి దారికాగలదు' నేనూ మౌనంగానే జవాబు చెప్పాను గడియారపు ముల్లుకి.

*




**రచయిత సెల్ నెం: 80198 00207**